
సాక్షి
జోగులాంబ గద్వాల
సోమవారం, 1, సెప్టెంబర్, 2025



..దొంగలు దండి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో రాకపోకలు సాగిస్తున్న రైళ్లలో ఇటీవలి కాలంలో దొంగల బెడత తీవ్రమైంది.
-8లో ▸



జూరాలకు వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ఆదివారం నిలకడగా కొనసాగింది.
-8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.0 /23.0

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శోభాయమానంగా నిమజ్జనోత్సవం



గద్వాల టౌన్: నమో పార్వతీ తనయా.. ఏక దంతాయా.. విఘ్నరాజాయా... జైజై గణేశా.. జైకొట్టు గణేశా.. అంటూ వాడవాడల పూజలు అందుకున్న బొజ్జ గణపయ్యకు ఇక సెలవంటూ భక్తులు వేడుకల మధ్య వీడ్కోలు పలికారు. ఐదు రోజుల్లో భాగంగా ఆదివారం చేపట్టిన శోభాయాత్ర వైభవంగా సాగింది. పట్టణంలోని పలు వినాయకులను నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవానికి ముందు ఆయా మండపాల వద్ద గణనాథులకు ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు, యువకులు ఉత్సాహంగా నిమజ్జనోత్సవ ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తుల అశేష పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వివిధ ఆకృతులలో ఏకదంతుడిని తీర్చిదిద్దిన భక్తులు ప్రత్యేక ఆకర్షణతో నిమజ్జనోత్సవానికి తరలివెళ్లారు. యువకులు, చిన్నారులు, పెద్దలు నృత్యాలు, భజనలతో కోలాహలంగా సాగింది.

ప్రభుత్వ వైఖరిని ఖండించాలి




శాంతినగర్: బాధిత ప్రజలను కలిసే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందని, బాధిత ప్రజలను కలవడానికి వెళ్తుంటే పోలీసులు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ పీపుల్స్ జాక్ రాష్ట్ర కోకన్వీనర్ కన్నెగంటి రవి, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆలిండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య అన్నారు. రాజోళి మండలంలోని పెద్దధన్వాడ సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీ బాధితులను కలవడానికి వారు వెళ్తుండగా శాంతినగర్ పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దౌర్జన్యం చేయడమే కాకుండా అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇథనాల్ కంపెనీ వల్ల వాయు, జల, భూగర్భ కాలుష్యం వల్ల క్యాన్సర్ లాంటి ప్రమాదకర రోగాలు వస్తాయన్నారు. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న ఇథనాల్ కంపెనీని వ్యతిరేకించకుండా యజమానులకు వత్తాసు పలుకుతూ, కంపెనీ నిర్మాణానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య పాలన పేరుతో ప్రజలను మభ్యపెడుతూ ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజాస్వామ్య వాదులు, మేధావులు ఖండించాలన్నారు. హైదరాబాద్ నుంచి మేధావులు వచ్చారని తెలుసుకున్న పెద్దధన్వాడ, మాన్‌దొడ్డి ప్రజలు, రైతులు కలుకుంట్ల వద్ద వెళ్తున్న వారిని కలుసుకుని తమ గోడు వెలిబుచ్చారు. ఆయా గ్రామాల ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వారితో వివరించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ డెమోక్రసీ (ఐఎఫ్‌డీ) స్వామిదాస్, సామాజిక కార్యకర్త రాజగోపాల్ తదితరులున్నారు.

వైద్యం.. గాలిలో ప్రాణం

నడిగడ్డలో మితిమీరుతున్న ఆర్‌ఎంపీల ఆగడాలు

- అన్నిరకాల రోగాలకు యథేచ్ఛగా చికిత్స
- స్కానింగ్, రక్త పరీక్షలు, రెఫర్స్ అన్నీ వీరి నుంచే
- ధనార్జనే ధ్యేయంగా అమాయకుల ప్రాణాలతో చెలగాటం
- నామమాత్రపు తనిఖీలతో నరిపెడుతున్న యంత్రాంగం



జిల్లాకేంద్రంలోని ఓ క్లినిక్‌లో స్వాధీనం చేసుకున్న మందులు, రెఫర్ స్లిప్‌లు (ఫైల్)

గద్వాల క్రైం: నడిగడ్డ ప్రాంతంలో ఆర్‌ఎంపీల ఆగడాలు మితిమీరుతున్నాయి. వీరు చదివింది పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ అయినా నిరక్షరాస్యుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని.. వచ్చీ రాని వైద్యంతో అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతూ రూ.వేలు దోచుకుంటున్నారు. ఇటీవల వారి వైద్యానికి ఓ చిన్నారి మృతిచెందిన గట్టు మండలంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలే కాకుండా.. జిల్లాలో ఆర్‌ఎంపీల ఆగడాలకు ఎందరో బలవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వైద్యాధికారుల నిర్లక్ష్యం, మామూళ్ల మత్తు వల్లనే ఆర్‌ఎంపీల అకృత్యాలకు అడ్డుకట్ట పడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అదునుగా విచ్చలవిడిగా చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసుకుని ఆర్‌ఎంపీలు మాఫియాగా మారారు. కార్పొరేట్ నుంచి మల్టీ లెవల్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లకు ఆర్‌ఎంపీలు రోగుల వైద్య పరీక్షల కోసం రెఫర్ చేస్తున్నారు.

ఇష్టానుసారంగా వైద్య సేవలు..

జోగుళాంబ జిల్లాలోని గద్వాల- అలంపూర్ సెగ్మెంట్లలో 251 గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో రెండుకు పైగా ఆర్‌ఎంపీల క్లినిక్‌లు (502) ఇలా వివిధ స్థాయిల్లో ప్రజలకు అత్యవసర సమయంలో వివిధ స్థాయిలో ఇష్టానుసారంగా చికిత్స అందిస్తున్నారు. అత్యధిక డోసులు గల, నిషేధించిన మందులు అందిస్తూ త్వరగా ఉపశమనం కలిగించేలా చేస్తున్నారు. మరోవైపు కొందరు ఆర్‌ఎంపీలు పిల్లల కోసం అంటూ ప్రత్యేకంగా మందులు ఇస్తున్నారు. సుఖ వ్యాధుల నుంచి తక్షణ ఉపశమనం కలగాలన్నా.. గర్భిణులకు చెకప్, గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితిపై రిపోర్టుల కోసం స్కానింగ్ ఇలా జబ్బు ఏదైనా డబ్బులు దండుకోవడమే పరమావధిగా దందా సాగిస్తున్నారు.

మచ్చుకు కొన్ని సంఘటనలు

- 20.8.2025న గట్టు మండలం ఆలూరు గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అయితే ఆర్‌ఎంపీ హై ఫీవర్ కలిగిన ఇంజెక్షన్ ఇవ్వడంతో ఆ చిన్నారి మృతి చెందింది.
- 26.8.2025న జిల్లాకేంద్రంలోని ఓ చికిత్సాలయంలో ఆర్‌ఎంపీ రోగులకు వైద్యం, హెవీ ఫ్లూయిడ్స్, యాంటీబయోటిక్స్ పెయిన్ కిల్లర్ మందులను సీజ్ చేశారు. అన్ని రకాల వ్యాధులకు చికిత్స చేయడం, వివిధ శస్త్రచికిత్సల సామగ్రిని స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

కలెక్టర్ ఆదేశాల మేరకు..

అనుమతి లేకుండా జిల్లాలో పలు ప్రథమ చికిత్స, ఆస్పత్రులు ఉన్నట్లు గుర్తించి తనిఖీలు చేపడుతున్నాం. వారి నుంచి ప్రమాదకరమైన మందులను సీజ్ చేశాం. ప్రజల ఆరోగ్యంపై కొందరు ఆర్‌ఎంపీలు చేస్తున్న సేవలు దారుణంగా ఉన్నాయి. ఇలాంటి చర్యలపై శాఖాపరమైన చర్యలు, కలెక్టర్ ఆదేశాల మేరకు కఠినమైన చర్యలు తీసుకుంటాం. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిని ఎంతమాత్రం వదిలిపెట్టం.



– సిద్ధప్ప, జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి

రూ.లక్షల్లో సంపాదన

సాధారణంగా ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సి ఉంటుంది. అయితే ఇదే అదునుగా భావించి గ్రామాల్లో వైద్యుల అవతారం ఎత్తి సామాన్య ప్రజలు అనారోగ్య కారణాలతో అక్కడికి వెళ్తే అన్ని రకాల రక్త పరీక్షలు, మందులు, ఇంజెక్షన్లు ఇవ్వడం, వ్యాధి తగ్గకుంటే అనుబంధ ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేయడం, వారి నుంచి కమీషన్ తీసుకోవడం వంటివి చేస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. ఈ క్రమంలో వారికి ఏదైనా సమస్య వస్తే కొందరు వైట్ కాలర్ నాయకులు సైతం అండగా నిలుస్తున్నారు. ఆర్‌ఎంపీలకు మందుల సరఫరాలో వివిధ మందుల ఏజెన్సీ నిర్వాహకులతో వ్యాపార ఒప్పందాలు ఉండడం, ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి కూడా మందులు కొనుగోలు చేయడం జరుగుతుంది. ఇలాంటి దందాలపై నిఘా ఉంచాల్సిన డ్రగ్ కంట్రోల్ అధికారులు సైతం చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దాడులు చేయకుండా నెలవారి మామూలు కోసం ఎదురుచూస్తారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పుడప్పుడు తమ మాట వినని వారిపై దాడులు చేస్తూ చేతులు దులుపుకొంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.



మండలం ఆలూరులో చిన్నారి మృతిపై వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారులు (ఫైల్)

కేసులు నమోదు చేస్తాం..

రోగులను మోసం చేస్తున్న ఆర్‌ఎంపీలపై నిఘా ఉంచాం. వారు చేయాల్సిన సేవలు మాత్రమే చేయాలి. మత్తు కలిగించే మందులు, స్టెరాయిడ్స్, నొప్పులు నివారించే మందులు తదితర వాటిని ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు.. వారికి ఏ నిబంధనలతో మందులు ఇస్తున్నారనే అంశాలపై ప్రత్యేక విచారణ చేపడుతాం. చట్ట వ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.



– శ్రీనివాసరావు, ఎస్పీ

తగ్గిన ఎండుమిర్చి సాగు



మానవపాడు మండలం చెన్నిపాడు శివారులో సాగు చేసిన ఎండుమిర్చి

- గతేడాదితో పోల్చితే 10 వేల ఎకరాల్లో తగ్గుదల
- తెగుళ్ల బెడదతో దిగుబడిపై ప్రభావం
- ధరలు రాకపోవడమూ కారణమే..
- పత్తిపంట వైపు మొగ్గు చూపిన రైతులు

గద్వాల వ్యవసాయం: జిల్లాలో ఎండుమిర్చి సాగు ఈ ఏడాది తగ్గింది. గతేడాదితో పోల్చితే దాదాపు 10 వేలకు పైగా ఎకరాల్లో తగ్గింది. ఎండుమిర్చికి గడిచిన మూడేళ్ల నుంచి ఆశించిన స్థాయిలో ధరలు రావడం లేదు. గోదాంలలో నిల్వ ఉంచుతున్నప్పటికీ సరైన ధరలు పొందలేకపోతున్నారు. దీంతో ఈ ఏడాది చాలామంది రైతులు ఎండుమిర్చికి బదులుగా పత్తి పంట సాగు వైపు మొగ్గు చూపారు.

నల్లరేగడి భూముల్లో..

గడిచిన 15 ఏళ్లుగా ఇక్కడి రైతులు అత్యధికంగా ఎండుమిర్చి సాగుపై దృష్టిసారిస్తున్నారు. బోర్లు, బావులతోపాటు నల్లరేగడి భూముల్లో వర్షాధార పంటగా మిర్చి సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలించి పంట బాగా చేతికి వస్తే పత్తి కన్నా మిర్చికి మంచి ధరలు లభిస్తాయన్న ఉద్దేశంతో ఈ పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు 15 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు సాగు ఖర్చులు అవుతాయి. కరుణ, సూపర్ టెన్, జిత్రి, కావేరి, తేజచిల్లి, బ్యాడిగ తదితర రకాలను ఎక్కువగా ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్నారు.

తెగుళ్ల బెడదతో..

గడిచిన 2022-23లో జిల్లాలో 36 వేలు, 2023-24 లో 65,113 ఎకరాల్లో ఎండుమిర్చి సాగు చేశారు. పంట బాగా వస్తుందనుకునే సమయంలో త్రిప్స్, ఎండుమడత, జెమిని రకాలకు తెగుళ్ల ఆశించాయి. ఈ తెగుళ్ల ప్రభావం పంట దిగుబడులపై పడింది. ఫలితంగా దిగుబడులు గణనీయంగా తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఎకరాకు కనీసం 15 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 8 నుంచి 12 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఇదే సమయంలో ధరలు కూడా పడిపోయాయి. ధరలు రాకపోవడంతో నెలల తరబడి శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచుకున్నారు. ఇక గడిచిన ఏడాది (2024-25)లో 34,073 ఎకరాల్లో పంట సాగు చేయగా.. ఈసారి కూడా రైతులను నష్టాలే వెంటాడాయి. మొదటి మూడు నెలలు బాగా వచ్చిన పంట ఆ తర్వాత తెగుళ్ల, వాతావరణ పరిస్థితులతో దిగుబడులు ఆశించిన స్థాయిలో రాలేదు. కాగా ఎండుమిర్చిలో వెరైటీని బట్టి ధరలు లభిస్తాయి. కొన్ని వెరైటీలకు క్వింటాకు రూ.15 వేల నుంచి రూ.25 వేలు రావాల్సి ఉండగా రూ.8 వేల నుంచి రూ.12వేలు, ఇక మరికొన్ని వైరైటీలకు రూ.45 వేల నుంచి రూ.50 వేలు రావాల్సి ఉండగా రూ.30 వేల నుంచి రూ.40 వేలు మాత్రమే వచ్చాయి. ఇలా వరుసగా మూడేళ్లు ఆర్థికంగా నష్టాలు చవిచూశారు.

మార్కెట్ సౌకర్యం లేక..

ఈ ఏడాది 33,472 ఎకరాల్లో ఎండుమిర్చి సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే గడిచిన మూడేళ్ల నుంచి ఎండుమిర్చికి రకరకాల తెగుళ్ల, వైరస్‌లు సోకుతున్నాయి. వీటి వల్ల దిగుబడులు తగ్గుతున్నాయి. మరోవైపు ఏటా ఈ పంటకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. వీటన్నింటితోపాటు స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేదు. దీంతో దళారులకైనా అమ్మాలి లేదా వ్యయప్రయాసాలకు ఓర్చి కర్నూలు, గుంటూరు, రాయచూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితులను ఇక్కడి రైతులు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు కాస్త భిన్నంగా ఉన్నాయి. జూన్‌లో సరిగా కురవని వర్షాలు జూలై రెండో వారంలో వచ్చాయి. ఆ తర్వాత ఆగస్టు రెండో, చివరి వారం ఎడతెరపి లేని వర్షాలు కురిసాయి. వీటన్నింటి కారణంగా ఎండుమిర్చి సాగు ఈ ఏడాది తగ్గింది. ఎండుమిర్చికి బదులుగా చాలామంది రైతులు పత్తి పంట వేశారు. ఎండుమిర్చి 33,472 ఎకరాల్లో అంచనా ఉండగా 24,500 ఎకరాల్లో మాత్రమే సాగైంది. గతేడాదితో పోల్చితే దాదాపు 10 వేల ఎకరాల్లో సాగు తక్కువ అయ్యింది.



మానవపాడు మండలం గోకులపాడులో ఆరబెట్టిన ఎండుమిర్చి (ఫైల్)

ఐదు ఎకరాల్లో మాత్రమే వేశా..

గడిచిన రెండేళ్ల పది ఎకరాల్లో ఎండుమిర్చి సాగు చేశాను. విపరీతంగా తెగుళ్ల వచ్చాయి. పురుగు మందులకు రూ.వేలకు వేలు ఖర్చు పెట్టినా ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. దీనికితోడు ధరలు కూడా పలకలేదు. ఆర్థికంగా చాలా నష్టం జరిగింది. దీంతో ఈసారి ఐదు ఎకరాల్లో మాత్రమే ఎండుమిర్చి వేశాను.



– వెంకటేశ్వర్లు, రైతు, చెన్నిపాడు, మానవపాడు మండలం

పత్తి సాగు చేశారు..

జిల్లాలో ఈ ఏడాది ఎండుమిర్చి దాదాపు 33 వేల ఎకరాలకు పైగా సాగు అవుతుందని అంచనా వేశాం. అయితే చాలా చోట్ల ఎండుమిర్చికి బదులుగా రైతులు పత్తి సాగు చేశారు. దీంతో ఈ ఏడాది ఎండుమిర్చి సాగు తగ్గింది. తెగుళ్ల బెడద, పంట దిగుబడి తగ్గడం, ధర లేకపోవడం వంటివి ఇందుకు కారణమయ్యాయి.



– ఎంఏ అక్బర్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోకి నడిగడ్డను తీసుకొస్తా



ఉత్తమ ఉపాధ్యాయులతో జిల్లా ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

గద్వాల టౌన్: ప్రస్తుత మహబూబ్‌గనర్ పార్లమెంట్ పరిధిలో నడిగడ్డ ప్రాంతం లేకపోవడంతో తాను అనుకున్న స్థాయిలో గద్వాలను అభివృద్ధి చేయలేకపోతున్నానని ఎంపీ డీకే అరుణ తెలిపారు. గతంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో నడిగడ్డ ప్రాంతం ఉండేదని, నాపై కోపంతో ఓ రాజకీయ పెద్ద మనిషి ఈ ప్రాంతాన్ని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కలిపేశారని ఆరోపించారు. ఆదివారం తపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురువందన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాబోయే నియోజకవర్గాల పునర్విభజనలో నడిగడ్డ ప్రాంతాన్ని తిరిగి మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో వచ్చేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. గతంలో నాయకులు చేసిన తప్పును సరిచేస్తానని వివరించారు. అసమర్థ పాలన వలన ప్రస్తుతం గద్వాల అభివృద్ధి ఆమడదూరంలో ఉందని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధే తప్ప, ఇప్పుడేమి కనిపించడం లేదని ధ్వజమెత్తారు. నడిగడ్డ అభివృద్ధికి కృషి చేస్తూ పూర్వ వైభవం తీసుకొస్తానని చెప్పారు. ఇకపై 15 రోజులకోసారి గద్వాల ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ తన గెలుపులో నడిగడ్డ ప్రాంతం కీలకంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దితేనే గుర్తింపు వస్తుందని అభిప్రాయపడ్డారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పాలని సూచించారు. విద్యాభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. అంతకు ముందు జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతురావు, జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, అయ్యస్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా బారిన పడొద్దు

- ఆరోగ్యకర జీవనశైలితో జబ్బుకు దూరం
- వర్షాకాలంలో కొత్తనీరుతో అనారోగ్య సమస్యలు

- వివరాలు 8లో..
- పాలమూరు

అల్లంత దూరాన.. ఆశల వారధి

- ఎన్నికల హామీగా మారిన కృష్ణానదిపై వంతెన నిర్మాణం
- మూడు దశాబ్దాలకుపైగా తప్పని ఎదురుచూపులు
- రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తగ్గనున్న 145 కి.మీ., దూరభారం
- అందుబాటులోకి వస్తే వ్యాపారాలు, అభివృద్ధికి దోహదం
- జాతీయ రహదారి ఏర్పాటుతోనైనా మోక్షం కలిగేనా?

అచ్చంపేట: తెలంగాణ- ఆంధ్రప్రదేశ్‌లను కలిపే మద్దిమడుగు వంతెన నిర్మాణం ఎప్పుడెప్పుడా అని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. నల్లమలలోని కృష్ణానదిపై వంతెన ఏర్పాటు దశాబ్దాలుగా పాలకులు చెబుతున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రతిసారి ఎన్నికల సందర్భంగా వంతెన ఏర్పాటుపై హామీలు ఇస్తున్నారే తప్ప నెరవేర్చలేకపోతున్నారు. పదర మండలం మద్దిమడుగు సమీపంలోని కృష్ణానదిపై వంతెన నిర్మిస్తే కోస్తాంధ్ర ప్రాంతాలకు చేరువవుతుంది. నాగర్‌కర్నూల్ జిల్లా మద్దిమడుగు (కసన్‌రేవు)- గుంటూరు జిల్లా రామచంద్రాపురం తండా మధ్య కిలోమీటరు వంతెన నిర్మాణం చేపడితే మాచర్లకు 145 కి.మీ., దూరభారం తగ్గుతోంది. ఇందుకు సుమారు రూ.250 కోట్లు ఖర్చు అవుతుంది. మద్దిమడుగు వద్ద కృష్ణానదిపై వంతెన, జాతీయ రహదారి నిర్మాణానికి సహకరిస్తూ ప్రత్యేక చొరవ తీసుకోవాలని గతేడాది ఆగస్టులో, ఈ ఏడాది జూలై 8న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీశైలం జలాశయం క్రస్ట్ గేట్లు ఎత్తేందుకు వచ్చిన ఏపీ సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో దీని ఆవశ్యకత గురించి మాట్లాడాలని గత నెలలో ఎంపీ మల్లురవికి విన్నవించారు.

తగ్గనున్న దూరభారం..

జాతీయ రహదారి-44 భూత్పూర్ నుంచి నాగర్‌కర్నూల్, అచ్చంపేట, మద్దిమడుగు మీదుగా కృష్ణానదికి అవతల ఏపీ 12 కి.మీ., దూరంలోని గుంటూరు జిల్లా చిరిగిరిపాడు (మాచర్ల) వరకు 165 కి.మీ., జాతీయ రహదారి, కృష్ణానదిపై వంతెన నిర్మాణం చేపట్టాలనే అంశం తెరపైకి వచ్చింది. 2017 నుంచి ఇప్పటి వరకు పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ రహదారిని ప్రతిపాదిస్తూ కేంద్రానికి పంపించారు. అమ్రాబాద్, పదర మండలాల్లోని మద్దిమడుగు, ఇప్పలపల్లి, మారడుగు, ఉడిమిళ్ల, చిట్లంకుంట, వంకేశ్వరం, పదర తదితర గ్రామాల ప్రజలకు గుంటూరు, ప్రకాశం జిల్లాలతో సంబంధాలున్నాయి. చాలా ఏళ్ల కిందట ఆ ప్రాంతం నుంచి వచ్చిన వారు ఇక్కడ స్థిరపడ్డారు. అచ్చంపేట, మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గాల మధ్య కృష్ణానది ప్రవహిస్తుండటంతో అచ్చంపేట, దేవరకొండ, కొండమల్లేపల్లి, నాగార్జునసాగర్ మీదుగా మాచర్ల 193 కి.మీ., ప్రయాణించాల్సి ఉంది. మద్దిమడుగు సమీపంలో వంతెన నిర్మాణం చేపడితే మాచర్ల 48 కి.మీ., దూరం మాత్రమే ఉంటుంది. ఫలితంగా 145 కి.మీ., దూరభారం తగ్గడంతోపాటు కోస్తా- తెలంగాణ ప్రాంతాల మధ్య వ్యాపార సంబంధాలు మెరుగుపడుతాయి. విజయవాడ, గుంటూరు జిల్లాల మధ్య ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటు కావడంతో ఈ వంతెన ఏర్పాటుతో తెలంగాణ ప్రాంతం రాజధానికి అతి సమీపంలో ఉండటం, మాచర్ల, కారంపూడి, దాచేపల్లి, గురజాల, దుర్గి, గుంటూరు, విజయవాడ, అమరావతి ప్రాంతాల నుంచి కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ వెళ్లేందుకు మార్గం సుగమమవుతుంది.



మద్దిమడుగు సమీపంలో కృష్ణానదిపై వంతెన నిర్మించాల్సింది ఇక్కడే..

ప్రమాదకర ప్రయాణం..

పదర మండలం మద్దిమడుగు నుంచి కృష్ణానది వరకు బండ్ల మార్గం మాత్రమే ఉంది. మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు ఏపీ ప్రజలతోపాటు తెలంగాణలోని ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, కోదాడ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ప్రాంతాల ప్రజలు వస్తుంటారు. మాచర్ల, మద్దిమడుగు, ఇప్పలపల్లి, మారడుగు గ్రామాల ప్రజలు కాలి నడకన కృష్ణానది వరకు చేరుకొని అక్కడి నుంచి బుట్టల ద్వారా అవతలి ఒడ్డుకు చేరుకుంటారు. నిత్యం పశువుల వ్యాపారులు గొర్రెలు, పశువులను ప్రైవేట్ లాంచీల సాయంతో కృష్ణానదిలో ప్రమాదకరంగా దాటిస్తున్నారు. రెండు రాష్ట్రాల ప్రజలకు అవసరమైన రోడ్డును ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. 2006లో మద్దిమడుగు నుంచి ప్రకాశం జిల్లాలోని కృష్ణానది ఒడ్డున ఉన్న అలాటంపెంట వరకు రోడ్డు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.3.20 కోట్లు మంజూరు చేసింది. అప్పట్లో పర్యావరణ, అటవీశాఖ అనుమతి లభించకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకుంటే ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని వంతెన, రోడ్డు నిర్మాణం ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

కేంద్రంపై ఒత్తిడి తెస్తేనే..

మద్దిమడుగు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి ఆవశ్యకత గురించి రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. కేంద్రంపై ఒత్తిడి తెస్తేనే వంతెన, రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఇది నల్లమల ప్రజల చిరకాల ఆంకాక్ష నెరవేర్చే ప్రయత్నం చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణంలో చేర్చడంతో కేంద్రం పరిశీలనలో ఉంది.



– వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

ప్రతిపాదనలు పంపించాం..

రెండు రాష్ట్రాల మధ్య కృష్ణానదిపై మద్దిమడుగు వద్ద వంతెన అవసరం గుర్తించాం. ఇప్పటికే కొత్త జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం. జాతీయ రహదారి- 44 నుంచి నాగర్‌కర్నూల్, అచ్చంపేట, మద్దిమడుగు మీదుగా ఏపీలోని చిరిగిరిపాడు(మాచర్ల) వరకు 165 కి.మీ., రోడ్డును ప్రతిపాదించాం. ఈ రోడ్డు మార్గంలో కృష్ణానదిపై వంతెన ఏర్పాటు ఉంది.



– మల్లురవి, ఎంపీ, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

పొలికెపాడులో మహిళ దారుణ హత్య



గోపాల్‌పేట: ఉన్నట్టుండి తెల్లవారేసరికి గ్రామంలోని ఓ ఇంట్లో మర్డర్ జరిగిందని తెలియడంతో మండలంలోని పొలికెపాడు గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని పొలికెపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ నరేష్‌కుమార్ కథనం ప్రకారం .. మండలంలోని పొలికెపాడు గ్రామానికి చెందిన మహమూద(55), చోటేమియా భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉండగా అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. అయితే ఇద్దరు కుమారులు కుమారులు హైదరాబాద్‌లో పనులు చేసుకుని జీవనం సాగిస్తుండగా.. భార్యాభర్తలు మాత్రమే గ్రామంలో కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నారు. కొన్నిరోజులుగా చోటేమియాకు ఆరోగ్యం బాగో లేకపోవడంతో ఆస్పత్రిలో చూపించారు. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. తెల్లారేసరికి మహమూద రక్తపు మడుగులో పడి ఉంది. ప్రతిరోజూ ఉదయమే లేచే మహమూద ఎంతకూ బయటికి రాకపోవడంతో చుట్టుపక్కల వారు తలుపు తెరిచి చూడగా మహమూద రక్తపు మడుగులో పడిపోయి కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తలపై, చెంప దగ్గర పదునైన ఆయుధంతో దాడి చేయడంతోనే మరణించిందని పోలీసులు గుర్తించారు. శనివారం రాత్రి ఇంట్లో గొడవ జరగడం, ఉదయం భర్త కనిపించకపోవడంతో భర్తనే ఈ హత్య చేసి ఉంటాడనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ కృష్ణ పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించాయి.

మహిళ మృతదేహం లభ్యం



లక్ష్మీ (ఫైల్)

తిమ్మాజీపేట: మండలంలోని పుల్లగిరికి వెళ్లే దారిలో ఉన్న గుడ్‌షెప్పర్డ్ పాఠశాల వెనుక భాగంలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. తండావాసుల కథనం మేరకు ముడావత్ లక్ష్మీ 6 రోజుల క్రితం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త వెంకటయ్య శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ క్రమంలో గుడ్ షెప్పర్డ్ పాఠశాల వెనుక కుక్కలు అరుస్తుండడం గమనించిన అటుగా వెళుతున్న వారు దగ్గరకు వెళ్లి చూడగా మృతదేహం ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహం ముడావత్ లక్ష్మీదిగా గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంపతులపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

నవాబుపేట: మండల పరిధిలోని పోమాల్ గ్రామానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్ దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మహిళపై దాడి చేయడంతో పాటు లైంగిక దాడి చేసేందుకు యత్నించగా ఆమె భర్త అడ్డుకునే ప్రయత్నం చేయబోయాడు. దీంతో రమేష్ అతనిపై కూడా దాడి చేశాడు. ఈ క్రమంలో బాధితురాలు ఆదివారం పోలీసులను ఆశ్రయించింది. గతంలో జరిగిన లైంగిక దాడి ఘటనలో తనపై ఉన్న పాత కేసును విత్‌డ్రా చేసుకోవాలని దాడిచేసి భయభ్రాంతులకు గురిచేసినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రైలుబండి.. దొంగలు దండి





రైల్వే స్టేషన్ తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

- రైళ్లలో ఏటా పెరుగుతున్న దొంగతనాలు
- విలువైన వస్తువులు, బంగారం, నగదు మాయం
- రెండేళ్లలో 57 కేసుల్లో రూ.27.89లక్షల సొమ్ము చోరీ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైలుమార్గంలో ప్రయాణించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ఈ క్రమంలో ఇటీవల కాలంలో రైలులో భారీ దొంగతనాల నుంచి చిన్నపాటి జేబు దొంగతనాల వరకు బాగా పెరిగాయి. చిన్నచిన్న చోరీలు లెక్కగట్టగపోయినా పెద్దగా నష్టపోయిన బాధితులు రైల్వే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. రైలులో ప్రయాణం చేసే సందర్భంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్న విలువైన వస్తువులు, బంగారం, నగదు అపహరిస్తున్నారు. అంతరాష్ట్ర దొంగలతోపాటు తెలంగాణకు చెందిన ముఠాలు గ్రూప్‌లుగా ఏర్పడి కొన్ని ప్రత్యేక రైళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. దూర ప్రయాణాలు చేసే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వంటివాటిలో ఘటనలు అధికమవుతున్నాయి. రైలులో ప్రయాణం చేసేవారి నుంచి ప్రధానంగా బంగారం, నగదు, సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లను ఎక్కువగా చోరీ చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు రైలులో ప్రయాణం చేసే క్రమంలో విలువైన బంగారం మెడలో వేసుకుని వెళ్లడం, నిద్రించే సమయంలో వాటిపై సరైన దృష్టి పెట్టకపోవడంతో నష్టం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో 2024లో 31దొంగతనాల కేసులు నమోదైతే దీంట్లో రూ.16.17లక్షల విలువ చేసే సొమ్ము చోరీకి గురైంది. దీంట్లో ఇప్పటి వరకు కేవలం 18శాతం మాత్రమే రికవరీ చేయడం జరిగింది. ఇక 2025లో 26కేసులు నమోదైతే 11.72లక్షల సొమ్ము చోరీకి గురైతే 20శాతం రికవరీ చేయడం జరిగింది.

అప్రమత్తంగా ఉండాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రయాణం చేసే రైళ్లలో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నాం. ప్రయాణికులు ఎవరూ కూడా బంగారం, ఇతర విలువైన ఆభరణాలు శరీరంపై కన్పించేవిధంగా ఉండరాదు. అభరణాలను దుస్తులతో సక్రమంగా కవర్ చేసుకోవాలి. కన్పించే విధంగా ఎంటే దొంగలకు లక్ష్యంగా మారుతారు. అందరూ నిద్రపోకుండా కుటుంబంలో ఒకరు లగేజ్‌ను పరిశీలిస్తూ ఉండాలి. అనుమానితులు కన్పిస్తే రైల్వేపోలీసులు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

– రాజు, రైల్వే ఎస్‌ఐ

ముగిసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

- చాంపియన్‌గా ఖమ్మం



డిస్కస్ త్రోలో గోల్డ్‌మెడల్, షార్ట్‌పుట్‌లో కాంస్యపతకం సాధించిన క్రీడాకారిణి పూర్ణిమను సన్మానిస్తున్న శాంతికుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రెండు రోజుల పాటు పాలమూరు యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాజేంద్రప్రసాద్ స్మారక రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో చాంపియన్‌గా ఖమ్మం నిలిచింది. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు శాంతికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు ఆయన గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సునీల్‌కుమార్, ఆనంద్, శరత్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

⇨ బాలుర -16 వ్యక్తిగత టీం చాంపియన్‌షిప్‌లో 24 పాయింట్లు ఖమ్మం జిల్లా క్రీడాకారులు సాధించారు. బాలుర -20 టీం చాంపియన్‌షిప్‌లో 28 పాయింట్లు సాధించడంతో ఖమ్మం జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో మొదటి స్థానం సాధించింది. బాలికలు-16 విభాగంలో చాంపియన్‌షిప్‌లో 18 పాయింట్లతో హనుమకొండ, బాలికలు-18 చాంపియన్‌షిప్‌లో 20 పాయింట్లతో హైదరాబాద్, బాలికల- 20 విభాగంలో చాంపియన్‌షిప్‌లో 20 పాయింట్లతో మహబూబ్‌నగర్ నిలిచింది. బెస్టు మార్చ్‌ఫాస్ట్ టీంలో మహబూబ్‌నగర్‌కు మొదటి స్థానం లభించింది.

మార్కులు కాదు.. మార్పు కావాలి



పీయూ వీసీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బాసర ఐఐటీ వీసీ గోవర్ధన్, తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు కావాల్సింది మార్కులు కాదని, వారిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐఐటీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులకు ఇంజినీరింగ్ విభాగంలో అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలంటే స్కిల్స్ అవసరం అన్నారు. సర్టిఫికెట్ అనేది కేవలం ఒక అర్హతను మాత్రమే నిర్ణయిస్తుందని, స్కిల్స్ పూర్తి స్థాయిలో ఉద్యోగానికి సిద్ధం చేస్తాయన్నారు. క్యాంపస్‌లో ఉన్న అన్ని వసతులను విద్యార్థులను వినియోగించుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అలాగే హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ పురుషోత్తం మాట్లాడుతూ.. విద్యార్థులను విద్య ఒక్కటే ఉన్నతంగా తీర్చుదిద్దుతుందని, అటువంటి విద్యను నిర్లక్ష్యం చేస్తే జీవితంలో కష్టాలు తప్పవన్నారు. గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు వెళ్లాలన్నారు. బాసర ఐఐటీ యూనివర్సిటీ వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావాన్ని అలవర్చుకుంటే ఉన్నతంగా రాణించవచ్చని, బాసర ఐఐటీలో చదివిన విద్యార్థులు నేడు దేశ, విదేశాల్లో గొప్ప ఉద్యోగాలు చేస్తున్నారన్నారు.అనవసర విషయాల జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించి ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళీదర్శన్, ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్, రవీందర్, శివశంకర్, లక్ష్మీనారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సురవరం సంస్మరణ సభ

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు అతని కుమారుడు కపిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్మరణ సభకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సీపీఐ నాయకులు, కాంగ్రెస్ మంత్రులు జూపల్లి కృష్ణారావు, సంపత్ కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, బీజేపీ ఎంపీ డీకే అరుణ, జిల్లా నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

గుట్కా పాకెట్ల పట్టివేత

మద్దూరు: పట్టణంలోని సీఆర్ కిరాణం షాప్‌లో నిషేధిత గుట్కాలు విక్రయిస్తుండడంతో ఆదివారం ఎస్‌ఐ విజయ్‌కుమార్ అధ్వర్యంలో దాడులు నిర్వహించి రూ.15,235 విలువైన గుట్కా పాకెట్లు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే షాపు యజమాని విష్ణుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. నిషేధిత జర్దా, గుట్కా ప్యాకెట్లను ఎవరైనా అక్రమంగా నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


జడ్చర్ల టౌన్: మండలంలోని జాతీయ రహదారి-167పై గంగాపురం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన సాయికుమార్(20) అనే యువకుడు మృతిచెందినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. ఈ ఘటనపై సాయికుమార్ బాబాయ్ యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. శనివారం రాత్రి గణేశ్‌లను చూసి వస్తానని ఇంటి నుంచి బయలుదేరి రాత్రి 11 గంటలకు తిరుగు ప్రయాణంలో ప్రమాదం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

రాజాపూర్: తనపై అకారణంగా దాడిచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం రాత్రి రాయపల్లికి చెందిన రావుల శేఖర్ ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. మండలంని చెన్నవెల్లికి చెందిన రామకృష్ణ, అతని అనుచరులు రవి, శ్రీశైలం, నాగరాజు, బాలకృష్ణ తమ గ్రామ శివారులో ఉన్న పొలంలో ఉండగా అకారణంగా తనను అడ్డగించి దాడిచేసినట్లు ఆరోపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

డయేరియా బారిన పడొద్దు

- ఆరోగ్యకర జీవనశైలితో జబ్బుకు దూరం
- వర్షాకాలంలో కొత్తనీరుతో ఆరోగ్య సమస్యలు



పాలమూరు: డయేరియా.. అతి విరేచనాలు.. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల్లో ఇదీ ఒక్కటి. బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు, పరాన్నజీవులు, పేగు రుగ్మతలతోపాటు కలుషిత ఆహారం, నీరు తీసుకోవడంతో ఇది కలుగుతుంది. సూక్ష్మజీవుల సంక్రమణ ఫలితంగా కడుపులోని పేగువాపు అయినా విరేచనాలు తరుచూ అవుతాయి. చాలా సందర్భాల్లో ఇంటి చికిత్సతో తగ్గినా.. కొన్నిసార్లు నిపుణుడైన వైద్యుడిని సంప్రదించి సరైన వైద్య చికిత్స తీసుకోకుంటే ప్రాణాలకు ముప్పు తప్పదు. అన్ని వయసుల వారిలో వచ్చే డయేరియా నివారణకు తొలి మందు ఆరోగ్యకర జీవనశైలేనని వైద్యులంటున్నారు.

■ ఒక వ్యక్తి ఉదయం, సాయంత్రం తరచూ విరేచనాలకు వెళ్తుంటే డయేరియాగా గుర్తించవచ్చు. ఇలా నాలుగు వారాలు కొనసాగినప్పుడు అవి దీర్ఘకాలిక విరేచనాలుగా గుర్తించవచ్చని వైద్యులు అంటున్నారు. మనిషి జీవనశైలిలో మార్పుల కారణంగా కూడా డయేరియా రావచ్చని పేర్కొంటున్నారు. సిగరెట్లు ఎక్కువగా తాగడంతో అందులోని నికోటిన్ వదులు విరేచనాలు కలిగిస్తుందని వైద్యులు అంటున్నారు. మద్యం ఎక్కువగా తీసుకోవడంతో, అర్ధరాత్రి అల్పాహారం తీసుకోవడం వల్ల కూడా ఒక్కోసారి వీరేచనాలు కలుగుతుంటాయి. ఎక్కువ కాఫీ తాగడం, అధిక ఆహారం తీసుకోవడం, యాంటీబయాటిక్స్ మందులను వాడేవారిలో ఉదయాన్నే విరేచనాలు అవుతుంటాయి. ఆహారంలో బ్యాక్టీరియాతో కలుషితమైన ఆహారం తినడంతో కూడా ఇలా జరగవచ్చు. అలాగే ఇన్‌ఫ్లుయెంజా వంటి వైరస్, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ వల్ల, మానసిక ఒత్తిళ్లు, డీహైడ్రేషన్‌తో కూడా అధిక వీరేచనాలు కలుగుతాయి.

■ **లక్షణాలు:** కడుపుబ్బరం, తిమ్మిరి లక్షణాలు, తీవ్రమైన కడుపునొప్పి, జ్వరం, నీళ్ల విరేచనాలు, మలంలో రక్తస్రావం, నిద్రలేమి, వాంతులు వచ్చినట్లు అనిపించడం.

వైద్యుల సలహాలు పాటించాలి

వర్షాకాలంలో కొత్తనీరు రావడంతో అలాంటి నీటిని కాచి చల్లార్చకుండా నేరుగా తాగితే సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. డయేరియా సోకితే వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకొని మందులు వాడాలి. ఇంటి పరిసరాలతోపాటు స్వచ్ఛమైన, పరిశుభ్రమైన, కాచి చల్లార్చిన నీరు తాగాలి. వర్షకాలంలో సీజనల్ వ్యాధులపై చాలా అప్రమత్తంగా ఉండాలి. ఇంట్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– కృష్ణ, డీఎంహెచ్‌ఓ

■ **నివారణ:** ఆరోగ్యకరమైన జీవనశైలిని ఏర్పర్చుకోవడం ద్వారానే విరేచనాల నివారణ సాధ్యమవుతుంది. మంచి ఆహారం తీసుకోవడం, అందుకు తగ్గ వ్యాయామం క్రమం తప్పకుండా చేయడం, ఒత్తిడిని తగ్గించుకుని సానుకూల జీవనం గడపడం, ధూమపానం, మద్యపానం తగ్గించడం, మానసిక ఒత్తిడి ప్రభావాలను తగ్గించడానికి చర్యలు తీసుకోవడం, ఆరోగ్యకరమైన పేగు కదలికలను ప్రోత్సహించడం కోసం యోగా, ధ్యానం చేయడం ద్వారా అతి వీరేచనాల నుంచి బయటపడవచ్చు. పండ్లు, గ్లూటెన్ కల్గిన పిండి పదార్థాలు, డ్రైఫుడ్ వంటి తీసుకోవాలి. తక్షణం ఓఆర్‌ఎస్ తాగితే శరీరానికి కావాల్సిన ఖనిజాలు, నీరు అందించి నీరసం తగ్గుతుంది. గ్లూకోజ్‌ను అందించడం ద్వారా ప్రాణహాని తగ్గుతుంది.

జూరాలకు కొనసాగుతున్న వరద



జూరాల నుంచి 24 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- ప్రాజెక్టుకు 2.14లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టు 24 క్రస్టు గేట్ల ఎత్తివేత
- ప్రాజెక్టు నుంచి లక్షా 98వేల 437 క్యూసెక్కుల నీరు విడుదల

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు 2లక్షల 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఆదివారం సాయంత్రం 7 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 2లక్షల 14వేల క్యూసెక్కులకు స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 24 క్రస్టు గేట్లను ఎత్తి లక్షా 65వేల 984 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రంలో ఆరుయూనిట్లలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 30వేల 878 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 390 క్యూసెక్కులు, కుడి కాలువకు 390 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం లక్షా 98వేల 437క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 8.896 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

ముమ్మరంగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: తెలంగాణ రాష్ట్రంలోని కృష్ణనదిపై మొదటి ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాలపై నిర్మించిన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా ఈ ఏడాది రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి ముమ్మరంగా సాగుతోంది. జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రారంభం అయినప్పటినుంచి మే మాసంలోనే విద్యుదుత్పత్తి ప్రారంభమై రికార్డు సృష్టించారు. ఈఏడాది ఆగస్టు 31 నాటికి 561 మిలియన్ యూనిట్లను సాధించారు. కాగా ఈఏడాది 2025-26 సంవత్సరానికి 610 ఎంయూ టార్గెట్ ఉంది. ఎగువ కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో వర్షాలు భారీ స్థాయిలో కురుస్తుండడంతో నారాయణపూర్, ఆల్మట్టి డ్యాంల నుంచి వరదనీరు జూరాలకు చేరుతుండడంతో విద్యుదుత్పత్తి లక్ష్యానికి చేరువలో ఉంది. ఆదివారం 7 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఈమేరకు ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, 265.643 ఎంయూ, దిగువలో 1 యూనిట్ల ద్వారా 40 మెగావాట్లు, 295.523 ఎంయూ ఉత్పత్తి చేశామన్నారు.

శ్రీశైలంలో పది గేట్లు ఎత్తివేత



శ్రీశైలంలో పది గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్న నీరు

దోమలపెంట: ఎగువ ప్రాంతాలు జూరాల, సుంకేసుల నుంచి వస్తున్న నీటి ప్రవాహం పెరగడంతో ఆదివారం శ్రీశైలం ఆనకట్ట వద్ద పది గేట్లను పైకెత్తి స్పిల్‌వే ద్వారా సాగర్‌కు నీటిని వదులుతున్నారు. జూరాలలో ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 1,65,984, విద్యుదుత్పత్తి చేస్తూ 31,456, సుంకేసుల నుంచి 62,580 మొత్తం 2,60,020 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తున్నాయి. శ్రీశైలంలో ఆనకట్ట వద్ద పదిగేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 2,69,730 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ.జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 30,237, మొత్తం 65,552 క్యూసెక్కుల నీళ్లను అదనంగా సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.6 అడుగుల నీటిమట్టం వద్ద 202.5056 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 27,000, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,824 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.854 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.281 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు.







కృష్ణమ్మ ఒడికి.. గణనాథులు

- బీచుపల్లిలో విఘ్నాధిపతుల నిమజ్జనం
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

భక్తుల చేత ఐదురోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథులు క్రమంగా నిమజ్జనోత్సవానికి తరలుతున్నారు. గణేశ్ ఉత్సవాల్లో భాగంగా గణనాథులను శోభాయాత్రగా తరలించి ఆదివారం బీచుపల్లి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ విగ్రహాలను ఇక్కడ నిమజ్జనం చేసేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసింది. గజ ఈతగాళ్లు, వివిధ శాఖల అధికారుల సమక్షంలో భారీ క్రేను సహాయంతో గణనాథులను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం దృష్ట్యా బీచుపల్లి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ తోట శ్రీనివాసరావు, డీఎస్పీ మొగులయ్య, సీఐ రవిబాబు పరిశీలించారు. రెవెన్యూ, మత్స్యశాఖ, విద్యుత్, వైద్య, పోలీసు శాఖల అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించారు. అలాగే జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జాం కాకుండా ఇటిక్యాల ఎస్‌ఐ రవినాయక్ ఆధ్వర్యంలో ఆయా శాఖల సిబ్బందితో భద్రత కల్పించి నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించారు.

- ఎర్రవల్లి



కృష్ణమ్మ ఒడిలోకి చేరిన గణపయ్య